
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

7

సోమవారం 28 అక్టోబరు 2024



ఆట పాటలతో.. ఆనందమయ జీవితం గడపాల్సిన చిన్నారులు పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. బరువులు, బాధ్యతలు, భయాలు తెలియని ప్రాయం కుటుంబ బాధ్యతల్లో విలవిల్లాడుతోంది. బాదర బందీ లేని ప్రాయం కుటుంబ చట్రంలో పడి నలిగిపోతోంది. చీకూచింత లేకుండా, హాయిగా చదువుకుని బంగారు భవిష్యత్తును ఎంచుకోవాల్సిన చిన్నారులు మూడుముళ్ల బందీఖానాలో మగ్గిపోతున్నారు. ఆధునిక కాలంలోనూ బాల్యవివాహాల సామాజిక దురాచారం ముక్కుపచ్చలారని చిన్నారులను బలిచేస్తోంది. పెళ్లంటే ఏమిటో కూడా తెలియకుండానే చిన్నారుల జీవితాలు శిథిలమైపోతున్నాయి. విద్యా కేంద్రమైన గుంటూరులాంటి జిల్లాలో కూడా బాల్య వివాహాలు భారీగా నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికక్కడ అధికారులు అడ్డుకుంటున్న బాల్య వివాహాలు పదుల సంఖ్యలో ఉండగా ఇక వారికి తెలియకుండా జరుగుతున్నవి ఎన్నో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

SAY NO TO CHILD MARRIAGE

బాల్యం.. బందిఖానా

- మూడు ముళ్ల 'బంధ'నంలో బాలికలు
- సంరక్షణ భయంతోనే పెళ్లిబాటలో తల్లిదండ్రులు
- గడిచిన ఐదేళ్లలో ఆందోళనకర స్థాయిలో పెరుగుదల
- పట్టణ ప్రాంతాల్లోనూ నమోదవుతున్న బాల్య వివాహాలు
- అత్యధిక బాల్య వివాహాలు జరిగే జిల్లాల్లో నాలుగో స్థానంలో ఉమ్మడి గుంటూరు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలు.. కేరింతలు.. గిల్లికజ్జాలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. ఎప్పుడో 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటి ఆధునిక సమాజాన్ని కూడా వీడలేదు. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ తర్వాత బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీతంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లో ఈ మహమ్మారి జడలు విప్పి కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేస్తోంది. ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని మహిళల్లో ప్రస్తుతం 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. వీరిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలు 21.7 శాతం ఉన్నారు. వీరిలో 12.6 శాతం మహిళలు 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు. తగిన వయసు, శారీరక ఎదుగుదల లేకుండానే వీరు గర్భిణులుగా మారడంతో వీరి ప్రాణాలు ప్రమాదంలో పడిపోయాయి. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.



బాల్య వివాహాలు 35.4 శాతం

బాల్య వివాహాల రాష్ట్ర సగటు 29.3 శాతం. అయితే రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతకు మించి బాల్య వివాహాలు జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు కంటే 6 శాతం అధికం.

భయమే కారణం

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు తల్లిదండ్రులు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది.

వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియచేస్తూ తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అడ్డుకుంటారు. అయితే ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగా బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి.

పని చేయని చట్టాలు

బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేస్తోంది. 1872లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో తొలిసారి బాల్య వివాహాల రద్దు చట్టం చేశారు. ఆ తరువాత 1929లో లార్డ్ ఇర్విన్ కాలంలో 'శారద' చట్టం చేశారు. తాజాగా 2006లో ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మేరేజెస్ యాక్ట్ 2006ను చేశారు. ఈ చట్టం ప్రకారం ఆడపిల్లల వివాహ వయసు 18, మగపిల్లల వివాహ వయసును 21గా నిర్ణయించింది. కాగా కిందటేడాది ఈ చట్టాన్ని సవరించి ఇద్దరి వయసును 21 ఏళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయినా బాల్య వివాహాలు ఆగడం లేదు.

అడ్డుకుంటున్నా ఆగని బాల్య వివాహాలు

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటుంది. అయితే అధికారులకు సమాచారం అంది లేదంటే తెలిసి అడ్డుకున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరుగుతున్నాయి. ఇక వారికి తెలియకుండా జరుగుతున్న పెళ్లిళ్లు ఎన్నో అంతుబట్టడంలేదు. దీనిని బట్టి అధికారులు అడ్డుకుంటున్నా బాల్య వివాహాలు ఆగడంలేదని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా అది 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా, 2021లో ఆ సంఖ్య 37కు చేరింది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 2022 జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ 48 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా 2022లో 32, 2023లో 16, ఈ ఏడాది తొలి 8 నెలల్లో 16 కేసులు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో 21 బాల్య వివాహాలు ఆపగా, 2022లో 12, 2023లో 9, బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకూ 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉండవచ్చని సమాచారం.

బాల్య వివాహాలతో నష్టాలెన్నో..

- బాల్య వివాహాల వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
- సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేందుకు అవకాశం, స్వేచ్ఛ లేకుండా పోతుంది.
- చిన్న వయసులోనే గర్భం దాలిస్తే తల్లీబిడ్డలకు ప్రమాదమే.
- పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వెంటాడతాయి.
- బాలికల విద్యాహక్కును ఇది కాలరాస్తుంది. పిల్లలు నిరక్షరాశ్యులుగా, నైపుణ్యం లేనివారుగా మిగిలిపోతారు.



- సీసీఆర్ కార్డుల ప్రామాణికంగా రైతులకు రుణాలు
- నిబంధనల విషయంలో సడలింపు ఇచ్చే దిశగా కసరత్తు
- క్షేత్రస్థాయిలో కౌలురైతుల సమస్యల పరిష్కారం.. లబ్ధిపై దృష్టి

కౌలుకు మంచి రోజులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కౌలు రైతులు.. కష్టాలు కలిసి ఉంటాయి. నష్టం, కష్టమైనా సాగును మాత్రం వీరు వీడరు. కౌలు రైతులు ప్రధానంగా పెట్టుబడి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలకు నోచుకోక నష్టపోతుంటారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మంచి రోజులు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరకొర రుణాలతో విసిగి వేసారిన కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో సీసీఆర్ కార్డుల జారీతో పాటు రుణాల మంజూరుపై జిల్లాల వారీగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా జారీ చేసిన సీసీఆర్సీ కార్డులకు అందించిన రుణాలకు హస్తిమశకాంతం తేడా ఉండడంతో ఈ పరిస్థితి మారాలని తాజాగా జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఖరీఫ్ రుణాల విషయంలో లక్ష్యాన్ని చేరుకున్నామని బ్యాంకులు ఊదరగొడుతున్నప్పటికీ వాటిలో కౌలు రైతుల వాటా తీసికట్టుగా ఉండడంపై సమీక్ష జరిపింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కౌలు రైతులకు రుణాల విషయంలో మరింత మందికి న్యాయం జరిగేలా అడుగులు పడనున్నాయి. ఏటా బ్యాంకర్లు ప్రకటించే వార్షిక పద్దులో 5 శాతం మొత్తాన్ని కౌలు రైతులకు రుణాలుగా

(మిగతా 10వ పేజీలో..)





- కేవలం 3.38 గంటల్లోనే 257 కి.మీ ప్రయాణం
- గంటన్నర ముందుగానే గమ్యస్థానానికి చేరుతున్న రైళ్లు
- గతంలో ఐదు నుంచి ఆరు గంటల సమయం
- సమయ పట్టిక సవరించాల్సిన పరిస్థితి ఉత్పన్నం

పల్నాడు మార్గంలో పెరిగిన రైళ్ల వేగం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నంద్యాల సెక్షన్‌లో రైళ్ల ప్రయాణ వేగం గణనీయంగా పెరిగింది. దిగువమెట్ట వద్ద ఘాట్ సెక్షన్ మినహా అంతా రెండు వరసల మార్గం నిర్మాణం పూర్తికావడంతో ఈ రూట్‌లో రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తప్పింది. అంతేకాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తుండటంతో ముందుగానే గమ్యస్థానానికి చేరుకొని షెడ్యూల్ ప్రకారం బయలుదేరే సమయం కోసం లూప్‌లైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి. అయినప్పటికీ రైల్వే శాఖ టైంటేబుల్‌ని సవరించడం లేదు. ప్రధాన రైల్వేస్టేషన్లలో ఎక్కువ సమయం లూప్‌లైన్‌లో పెట్టడం వలన గూడ్స్ ట్రాఫిక్‌కి

(మిగతా 10వ పేజీలో..)



నంద్యాల మార్గంలో అత్యంత వేగంగా ప్రయాణించిన ఎస్ఎస్‌పీఎన్ ఎక్స్‌ప్రెస్

సరస్వతి భూముల్లో

గజిబిజి లెక్కలు

- వైసీపీ హయాంలో అధికారులు 1077 ఎకరాలు తేల్చగా
- ప్రస్తుత అధికారులు 992 ఎకరాలు తేల్చారు
- ఖచ్చితమైన లెక్కలు తేలుస్తున్న రెవెన్యూ అధికారులు

8

మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రటరీలకు...

ఎన్నెన్నో సవాళ్లు

- జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌లకు అడ్డుకట్ట వేయాలి
- మచ్చుకాయలు బయటకు తీసుకెళ్లడాన్ని నియంత్రించాలి
- ప్రతీ మిర్చి టిక్కీ అకౌంట్ ఫర్ చేస్తే మార్కెట్‌కి ఆదాయం

- కాగితాల్లోనే బుగ్గవాగు సామర్థ్యం పెంపు
- పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పనులు
- పాలకులకు పట్టని ప్రజల సాగు.. తాగునీటి కష్టాలు
- బుగ్గవాగుపైనే జలజీవన్ మిషన్, వాటర్‌గ్రిడ్‌ల ఆధారం
- కూటమి ప్రభుత్వం స్పందిస్తేనే నీటి సమస్యకు పరిష్కారం

ఆధునికీకరణకు.. అపసోపాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు వస్తున్నారు పోతున్నారు.. మేము తప్ప మరెవ్వరూ చేయలేరు అంటున్నారు.. అయినా నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని బుగ్గవాగు ఆధునికీకరణ దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. నాగార్జున సాగర్ కుడికాల్వ పరిధిలో ఏడాది పొడవునా పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తీర్చే అవకాశం ఉంటుంది. అయినా బుగ్గవాగు విస్తరణ పనులకు నడుంకట్టిన వారు లేరు. పాలకులు మారినప్పుడల్లా బుగ్గవాగు అంశాన్ని ప్రస్తావిస్తున్నారే తప్ప సామర్థ్యం పెంపుపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. పదేళ్లుగా పనులు ప్రతిపాదలనకే పరిమితమయ్యాయంటే పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. పాలకులు ఎవరికి వారు తామే బుగ్గవాగు సామర్థ్యం పెంచి ప్రజల నీటి కష్టాలను తీరుస్తామని గొప్పగా ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణ శూన్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో బుగ్గవాగు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే సాగు, తాగునీటి అవసరాల కొంత తీర్చే వెసులుబాటు ఉంటుంది. 3300 ఎకరాల్లో విస్తరించిన జలాశయాన్ని లోతు పెంచడం, కట్టలు ఎత్తు పెంచి వాటిని బలోపేతం చేయడం ద్వారా సామర్థ్యం పెంచవచ్చు. వరదల సమయంలో నీటిని బుగ్గవాగులో నిల్వ చేయడం ద్వారా అదనంగా నాలుగు టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుంది. పంటలకు.. తాగుకు అత్యవసర పరిస్థితుల్లో బుగ్గవాగు నుంచి నీటి వినియోగించుకునే వీలు ఉంటుంది. బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాలు ఆధారపడి ఉన్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందించే అవకాశం ఉంటుంది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం నెరవేరుతుంది. రూ.150కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం కూడా బుగ్గవాగుపైనే ఆధారపడి ఉంది.

వైసీపీ హయాంలో ఆర్భాటంతో సరి..

బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఐదేళ్లలో కార్యరూపం దాల్చలేదు. ప్రాజెక్టు పనుల వ్యయం అంచనాలు రూపొందించేందుకే ఆపసోపాలు పడింది. బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడి కాల్వ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ.202కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు చేపట్టక పోగా 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి డీపీఆర్ రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించింది. 2020 అక్టోబరులో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా మధ్యలోనే ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మరోమారు డీపీఆర్‌కు ప్రయత్నించినా అది ముందుకు సాగలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యం పెంపునకు సంబంధించిన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే బుగ్గవాగు ఆధునికీకరణ పనులను త్వరతగితిన చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఏ విధంగా కృషి చేస్తుందో చూడాలి.



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వకు నీటి సరఫరా

అభివృద్ధిని అడ్డుకున్న చరిత్ర అవినీతి మంత్రిది

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంతో శ్రమపడి గతంలో రూ.4200 కోట్లతో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకున్న హీన చరిత్ర అవినీతి మంత్రిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిలకలూరిపేట పురుషోత్తపట్నంలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కలసి శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల సహకారంతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ. 2.50 కోట్ల నిధులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. చిలకలూరిపేటను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని మొదలుపెట్టిన పనులు ఐదేళ్ల ఎక్కడికక్కడ ఆగిపోవటంతో ఎంతో ఆవేదన కలిగించిందని, అవినీతి మంత్రి గత ఐదేళ్లలో ప్రజల సమస్యలను గాలికి వదిలి వేశారని, తీసుకు వచ్చిన అభివృద్ధి పనులను ఒక్కటిగా కూడా ముందుకు తీసుకువెళ్లలేక పోయారని, దాని వల్ల నియోజక వర్గ ప్రజలు చాలా నష్ట పోయారని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఆర్నెల్లు ముందే ఇక్కడి నుంచి పారిపోయిన ఆమె అవినీతి పనులు సాగనీయని తీరు కారణంగా కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారన్నారు. అందుకు ఆ మంత్రి పాత్రకు సంబంధించి తన వద్ద అనేక సాక్షాలు ఉన్నాయన్నారు. ఈ కల్యాణ మండపం మంజూరులో ఎంపీ లావు పాలు పంచుకున్నారన్నారు. పురుషోత్తపట్నం అంటే మొదటి నుంచి తనకు ప్రత్యేక అభిమానం ఉందన్న ఆయన టీటీడీ కల్యాణ మండపం త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఎంపీ, తాను పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చిలకలూరిపేటలో ఏ శుభకార్యం జరిగినా ఈ కల్యాణ మండపానికే తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం అక్రమాల పుట్ట

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



రెంటచింతల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి నిరుపేద రైతుల నుంచి కారుచౌకగా భూములను కొట్టేసిన సరస్వతీ సిమెంట్ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం నిగ్గు తేల్చుతుందని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం తన స్వగ్రామమైన మంచికల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ వైపు రైతులను బెదిరించి, మరో వైపు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతామని మభ్య పెట్టి కార్పొరేట్ సంస్థల నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకున్నారని ధ్వజమెత్తారు. 2009లో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతామని, ఇక నుంచి పల్నాడులో నిరుద్యోగం ఉండదని బుకాయించారని, ఇప్పటికీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. భూములిచ్చిన రైతులపై అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. చంద్రబాబు పాలనలో తప్పు చేసిన వారు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ టీడీపీ నేత కె.శివ ప్రసాద్, మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరసింహారావు, పోట్ల సతీష్, నంబూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రటరీలకు... ఎన్నెన్నో సవాళ్లు



మిర్చియార్డు

● జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌లకు అడ్డుకట్ట వేయాలి
● మచ్చుకాయలు బయటకు తీసుకెళ్లడాన్ని నియంత్రించాలి
● ప్రతీ మిర్చి టిక్కీ అకౌంట్ ఫర్ చేస్తే మార్కెట్‌కి ఆదాయం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు ప్రక్షాళనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవతేజ, సెక్రటరీగా వి.ఆంజనేయులను నియమించింది. వీరిలో ఇప్పటికే సెక్రటరీ బాధ్యతలు స్వీకరించగా పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నేడో, రేపో జేసీ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే వీరిద్దరి ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వాటిని సరిగా అధిగమించకపోతే యార్డులో అవినీతి, అక్రమాలను రూపుమాపలేని పరిస్థితి. ముఖ్యంగా ఆయా లోపాల మూలాలకు వెళ్లి వాటిని అధిగమించాలి. ప్రభుత్వం కొత్త పాలకవర్గం ఏర్పాటు చేసేలోపు యార్డు కార్యకలాపాలను గాడిన పెడితే అటు రైతులకు, ఇటు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎంతో మేలు జరుగుతుంది.

గతంలో అందినకాడికి దోచేశారు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో అనేక అక్రమాలు జరిగాయి. రైతుల బాగోగులను గాలికి వదిలేసి ఎంతసేపటికి స్వీయ అర్జన పైనే ఆ పార్టీ నేతలు దృష్టి పెట్టారు. నేతలు తెర వెనకుండి ఇక్కడి పాలకులను డమ్మీలుగా చేసి అందినకాడికి దోచేశారు. మిర్చియార్డుకు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి రైతులు మిర్చిని విక్రయించేందుకు తీసుకొస్తుంటారు. దీనివలనే రాష్ట్రంలోని అన్ని కమిటీల కంటే గుంటూరు ఏఎంసీకి అధిక ఆదాయం లభిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ గుంటూరు మార్కెట్ కమిటీకే ఆదాయం అధికంగా ఉండేది. ఇక్కడి నుంచి వేరే కమిటీలకు రుణాలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఏఎంసీలో ట్రేడింగ్ జరిగిన మిర్చి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుండటం వలన అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు లభించాయి.

అడ్డుకట్ట వేస్తేనే ఆదాయం...

ఏటా దాదాపుగా రూ.20 వేల కోట్ల వరకు మిర్చి విక్రయాలు మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతుంటాయని అంచనా. అయితే గణాంకాల్లోకి మాత్రం ఇందులో సగమే వస్తుందని గతంలో మిర్చియార్డు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు కారణం జీరో బిజినెస్. యార్డులో గేట్ ఎంట్రీ అవుతున్న మిర్చి టిక్కీలు, ఈనామ్‌లో ట్రేడింగ్ జరిగిన తర్వాత బయటకు వెళ్లిపోతున్న టిక్కీల లెక్కలు సమానంగా ఉండటం లేదు. దీనిని బట్టి ఈనామ్‌లో వాణిజ్యం జరగకుండానే భారీగా బయటకు వెళ్లిపోతున్నాయి. అలానే యార్డులో కొన్ని రకాల వెరైటీలను కొన్న ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు తక్ పట్టీలలో నమోదు చేస్తున్నారు. దీనినే రేట్ కటింగ్ బిజినెస్ అని యార్డు పరిభాషలో మాట్లాడతారు. ఈ రెండిటి వలన యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్నది. నేటికీ రూ. 100 కోట్ల మధ్యనే కమిటీకి వార్షికాదాయం సమకూరుతున్నది. రేట్ కటింగ్, జీరో బిజినెస్‌లకు కనక పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రెటరీ అడ్డుకట్ట వేయగలిగితే కచ్చితంగా ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

● యార్డులో రైతులు ఎక్కువగా నష్టపోతున్నది మచ్చుకాయలు రూపంలోనే. ఇదొక వ్యవస్థీకృతం అయిపోయింది. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, గుమాస్తాలు, హమాలీలు కలిసి ఈ మచ్చుకాయలను తీసుకెళ్లి బయట విక్రయిస్తూ రైతుకు నష్టం కలిగిస్తున్నారు. అసలు యార్డు నుంచి మచ్చుకాయలు అనేవి బయటకు వెళ్లకుండా గేట్ల వద్ద సెక్యూరిటీ గార్డులు అడ్డుకొనేలా చూడాలి. ఈ క్రమంలో కార్మిక సంఘాల నేతలు హమాలీలను రెచ్చగొట్టే ప్రయత్నాలు కూడా జరుగుతాయి. అయితే వాటని సమర్థవంతంగా అడ్డుకొంటేనే మచ్చుకాయలు తీయడానికి అడ్డుకట్ట పడుతుంది.

● మార్కెట్ కమిటీ నిర్ణయించిన కమీషన్, కాటా, దొడ్డికాపలా కూలి వంటి వాటి ఛార్జీల అమలు చేయాలి. దీని వలన రైతుకు మేలు జరుగుతుంది.

● కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేస్తున్న మిర్చి టిక్కీలపై యాజమాన్యాలు జారీ చేసే బాండ్లు రైతుల పేర్లతోనే ఇచ్చేలా చూడాలి. లేకుంటే రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్(కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమాని కలిసి నకిలీ బాండ్లు సృష్టించి అమ్మేయడం) లాంటి సంఘటనలే జరుగుతాయి.

● మార్కెటింగ్ శాఖ జారీ చేసిన జీవో ప్రకారం కమీషన్ వ్యాపారస్తులతో సెక్యూరిటీ డిపాజిట్‌లు కట్టిస్తే యార్డు బ్యాంకు నిల్వలు పెరుగుతాయి.

● అన్ సీజన్‌లో కొన్నిరకాల పంట ఉత్పత్తులనైనా యార్డులో ట్రేడింగ్ జరిగేలా చూడగలిగితే అదనపు ఆదాయం సమకూరుతుంది. గతంలో గొర్రెల మండి రూపంలో ఆదాయం వచ్చేది. అది ఇప్పుడు ప్రత్తిపాడు పరిధిలోకి వెళ్లిపోయినందున ఆదాయం తగ్గింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ పరిధిలో మండి ఏర్పాటు చేసుకోగలిగితే ఆదాయం పెంచుకోవచ్చు.

సజావుగా ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు ప్రారంభం


పెదకాకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ పరీక్షలు ఆదివారం సజావుగా ప్రారంభమైనట్లు దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించినట్లు రామచంద్రన్ తెలిపారు. అదేవిధంగా వర్సిటీ దూరవిద్య కేంద్రంలో ప్రత్యేక విద్యార్థి సహాయ కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

పొన్నూరుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా జమ్ములపాలెంకు చెందిన గోవిందమ్మ(63) అనే వృద్ధురాలు ఆదివారం పొన్నూరు మండలం ములుకుదురు గ్రామం బంధువుల ఇంటికి వచ్చింది. బంధువులను పరామర్శించిన అనంతరం తిరుగు ప్రయాణం కావటానికి జీబీసీ రోడ్డులో వేచి ఉంది. అదే సమయంలో బాపట్ల వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు అతి వేగంతో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్న గోవిందమ్మను ఢీకొంది. ప్రమాదంలో గోవిందమ్మతోపాటు కారులోని వ్యక్తులకు గాయాలైనట్లు స్థానికులు వెల్లడించారు. గోవిందమ్మను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరస్వతి భూముల్లో గజిబిజి లెక్కలు

● వైసీపీ హయాంలో అధికారులు 1077 ఎకరాలు తేల్చగా
● ప్రస్తుత అధికారులు 992 ఎకరాలు తేల్చారు
● ఖచ్చితమైన లెక్కలు తేలుస్తున్న రెవెన్యూ అధికారులు



SARASWATHI POWER & INDUSTRIES LAND DETAILS OF MACHAVARAM MANDAL

S.No	Name of the Village	Extent Purchased	Govt. Land	Total	Online Ported (Mutation Completed)	Ready to Port	To be Ported	Conduct Survey
1	Chennayapalem	272.96	0	272.96	247.81	0.00	25.15	0.00
2	Pinnelli	93.79	2.87	90.92	78.10	0.00	[illegible]	0.00
3	Vemavaram	710.63	1.44	709.19	495.53	0.00	[illegible]	0.00
	TOTAL	1077.38	4.31	1073.07	821.44	0.00	255.94	0.00

TAHSILDAR MACHAVARAM

మాచవరం మండలంలో సరస్వతి సిమెంట్ యాజమాన్యం కొనుగోలు చేసిన భూములకు సంబంధించి గ్రామాల వారీగా వివరాలు

మాచవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల లెక్కల్లో గజిబిజి కన్పిస్తుంది. గతంలో మాచవరం మండలంలో రెవెన్యూ అధికారులుగా పని చేసిన వారు 1077 ఎకరాలు తేల్చగా ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు 992 ఎకరాలుగా తేల్చారు. అయితే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సరస్వతి భూముల్లో ఫారెస్టు భూములు, కుంట భూములు, వాగులు, గుంతల భూములు, ప్రభుత్వ అసైన్డ్ భూముల లెక్కలు తేలుస్తున్నారు. గత రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు సర్వేలో నిమగ్నమయ్యారు. తహసీల్దార్ క్షమారాణి శనివారం భూములను పరిశీలించి 1077 ఎకరాలు కొనుగోలు చేశారని, దానిలో 831.44 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు అయిందని, 255.94 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా 992 ఎకరాలు మాత్రమే సరస్వతి సిమెంట్ యాజమాన్యం కొనుగోలు చేసిన రిజిస్టర్ దస్తావేజులు తహసీల్దార్ కార్యాలయానికి అందజేయటంతో భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తహసీల్దార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. గత లెక్కల ప్రకారం ఇంకా 255 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉండగా, ఆ భూములు ఇంతవరకు ఆన్‌లైన్ ఎందుకు కాలేదనే సందేహాలు అధికారులు, ప్రజల్లోనూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ 255 ఎకరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయా?, ఫారెస్టు భూములు ఉన్నాయా?, కుంట పోరంబోకు, వాగు పోరంబోకు భూములు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. అంతేగాకుండా వేమవరం రెవెన్యూ శివారుల్లో 1900 సంవత్సరంలో బ్రిటీషు వారు ఎస్సీ కులాలకు సొసైటీ భూములకు పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో కూడా కొన్ని ఎకరాలు సరస్వతి సిమెంట్ యాజమాన్యం కొనుగోలు చేశారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. మొత్తం మీద సరస్వతి సిమెంట్ యాజమాన్యం ఎన్ని ఎకరాలు కొనుగోలు చేశారు?, వాటిలో పట్టా భూములు ఎన్ని?, ప్రభుత్వ భూములు ఎన్ని?, సొసైటీ భూములు ఎన్ని ఎకరాలనే లెక్కలు తేల్చే పనిలో మాచవరం తహసీల్దార్ కార్యాలయ అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తుంది. సోమవారం నాటికి పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

మిర్చియార్డు సెక్రటరీగా ఆంజనేయులు బాధ్యతల స్వీకారం



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నతశ్రేణి కార్యదర్శిగా వినుకొండ ఆంజనేయులు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వుల మేరకు ఆయన ఆదివారం యార్డు పరిపాలన భవనానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మాచర్లకు చెందిన ఆంజనేయులు 1985లో మార్కెటింగ్ శాఖ సర్వీసులోకి వచ్చారు. ఆయన దాదాపుగా 39 ఏళ్ల నుంచి మాచర్ల, పొన్నూరు, దుగ్గిరాల, తెనాలి, గుంటూరు, ఈపూరు, పొదిలి, గిద్దలూరు, కంభం, మార్కాపురం, మైలవరం, తుని, రాజమహేంద్రవరంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. గతంలో మిర్చియార్డులో అసిస్టెంట్ సెక్రటరీగా కూడా పరిపాలన విభాగంలో విధులు నిర్వహించిన అనుభవం ఉన్నది. నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. మిర్చి సీజన్ మరో రెండు నెలల్లో రాబోతున్నదనీ, ఆలోపు కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వసరుకు విక్రయం జరగాలనీ, అందుకోసం అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఎక్స్‌పోర్టర్లు, దిగుమతిదారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ కంట్రోల్ చేయడం, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, విశ్రాంతి భవనంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూస్తామన్నారు. సాధ్యమైనంత ఎక్కువగా లావాదేవీలు జరిగేలా చూసి మార్కెట్ ఫీజు పెంచడానికి కృషి చేస్తానన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



వీరారావు (ఫైల్‌ఫొటో)

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన యనగందుల వీరారావు (54) కౌలుకు భూమిని తీసుకుని వ్యవసాయం చేశాడు. గతంలో కొప్పర్రులో పొలం తీసుకుని వ్యవసాయం చేయగా, రెండేళ్లుగా గొట్టిపాడులో 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో వచ్చిన కొద్దిపాటి మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశాడు. ఇప్పటి వరకు రూ. 6.89 లక్షలు అప్పులు కావడం, అప్పులిచ్చిన వారికి స్టోరేజీలో ఉన్న మిర్చి అమ్మి బకాయిలు తీరుస్తానని చెబుతూ వస్తున్నారు. తీరా ఆ మిర్చిని అమ్మగా వచ్చిన రెండు లక్షల రూపాయల్లో ఏసీ అద్దెతో పాటు తీసుకున్న లోను పోగా చేతికి రూ.77 వేలు వచ్చాయి. అప్పులు ఇచ్చిన వారికి తన మొఖం ఎలా చూపించేది అనుకుని ఈ నెల 23న వీరారావు ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. అప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుఝామున మరణించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

సూర్యలంక తీరంలో ఇద్దరు యువకులు గల్లంతు

- ఒకరిని కాపాడిన పోలీసులు.. మరొకరు మృతి



కల్యాణ్ (ఫైల్‌ఫొటో)

బాపట్లరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గుంటూరుకు చెందిన 9మంది యువకులు సూర్యలంక తీరానికి స్నానాలకు వెళ్లారు. అయితే వీరిలో హుస్సేన్, కల్యాణ్ అనే ఇద్దరు యువకులు అలల తాకిడికి కొట్టుకుపోతుండగా గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు హుస్సేన్ అనే యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. కల్యాణ్ (20) అనే యువకుడు తీరంలో కొట్టుకుపోవటంతో అతని కోసం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 4 గంటల సమయంలో మృతదేహం తీరం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఈమేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీ హెచ్ సీల ద్వారా '104' సేవలు నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కే సత్యరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక పాతగుంటూరు ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరి గింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆప్కాస్ లేదా కాంట్రాక్టులో చేర్చి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం యూనియన్ నాయకత్వంతో తక్షణమే చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

సరిదిద్దుకుంటూ జీవితాన్ని సాగించాలి



మాట్లాడుతున్న భారతీయం సత్యవాణి, వేదికపై నూతక్కి రామకృష్ణ ప్రసాదు, సామినేని, చుక్కపల్లి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవితంలో సర్దుకుపోవద్దు, చేస్తున్న పొరపాటులను సరిదిద్దుకుని ముందుకు సాగాలని భారతీయం సత్యవాణి అన్నారు. ఆదివారం గుంటూరు, కుందులరోడ్డులోని కమ్మజన బాలికల వసతి గృహంలో సేవా సమితి 22వ తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశానికి సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిలుగా ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు, పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాదు హాజరైయ్యారు. ఈ సందర్భంగా భారతీయం సత్యవాణి మాట్లాడుతూ పరిపక్వత లేని వయస్సులో వ్యామోహాలకు లోనుకావద్దని, దారి తప్పితే దాని దుష్ఫలితాలు జీవితాంతం అనుభవించాలని సూచించారు. మీరు ఎంత ఎదిగినా తల్లిండ్రులను, పుట్టిన భూమిని మర్చిపోవద్దని అన్నారు. ఈ వసతి గృహం స్త్రీ జాతి వ్యక్తిత్వ కర్మాగారమని, ఇక్కడ నేర్చుకున్నది భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అన్నారు. బాలికల వసతి గృహానికి రూ.25 కోట్ల విరాళాన్ని అందజేస్తున్న నూతక్కి రామకృష్ణప్రసాదు అభినందనీయులని అన్నారు. నూతక్కి రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ బాలికల వసతి గృహం నాకు ప్రాణంతో సమానమని, నూతన భవన సముదాయాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ ఇంగ్లిషు భాషాపై ప్రావీణ్యం సాధించాలని, లేకపోతే భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయని సూచించారు. నూతన భవన నిర్మాణానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కారుమంచి ప్రసాదు, లియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంచేటి ప్రసన్నలక్ష్మి ప్రసంగించారు. ఈ సందర్భంగా దాతలు అందజేసిన రూ. 30లక్షల విరాళాల్ని 300 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీపీడీసీఎల్ డిస్కం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ప్రసాద్‌కు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ విభాగం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఏపీ సీపీడీసీఎల్ డిస్కం పరిధిలో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో విస్తరించిన సీపీడీసీఎల్ డిస్కం నూతన కార్యవర్గానికి అధ్యక్షుడుగా గుంటూరు నగరానికి చెందిన నార్నె శివరామకృష్ణప్రసాద్, కార్యదర్శిగా మోటుపల్లి శ్రీరామ్‌మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనున్నది. ఎన్ఎస్ఆర్‌కే ప్రసాద్ గతంలో గుంటూరు రీజనల్ నాయకుడిగా వ్యవహరించారు. సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరించే ప్రసాద్ డిస్కం అధ్యక్షుడుగా ఎన్నికవటం అభినందనీయమని పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గుంటూరు సర్కిల్ కార్యాలయ అధ్యక్షుడు కొత్తపల్లి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి రాయపాటి సీతారామయ్య నూతన అధ్యక్షుడు నార్నె శివరామకృష్ణప్రసాద్‌కు ఇతర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర, డిస్కం పరిధిలోని జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న కమాలదీప్తి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న వాగ్గేయకార మహోత్సవాలు ముగిశాయి. ఆదివారం కార్యక్రమాలను డాక్టర్ వై శైలజ, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి డిటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రధాన కచేరీలో భాగంగా విదుషి కస్తూరి కమల దీప్తి, విశాఖపట్నం వారి శాస్త్రీయ సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. వీరికి వయోలిన్ పై మండా శ్రీ రమ్యచ మృదంగంపై బుర్రా శ్రీరామ్ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వై.వీ.కే దుర్గా ప్రసాదరావు హాజరై ప్రసంగించారు. అనంతరం కళాకారులను, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని సంగీత మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీ విజయ, ఎం. వై. శేషురాణి పర్యవేక్షించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు ఎగువ నుంచి 45,305 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 44,222 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138, 148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా కసిన్యానాయక్

కారంపూడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా కారంపూడి పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోపీఆర్డీగా విధులు నిర్వహించిన సత్యప్రసాద్ బదిలీపై దుర్గి మండలానికి వెళ్లారు.



● మండల కేంద్ర మైన అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా దర్బార్' నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు సత్తెనపల్లి పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజలలకు అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.


వెంకట్రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి

వెంకట్రామయ్యకు నివాళి

రెంటచింతల, అక్టోబరు 27 మండలంలోని మంచికల్లు గ్రామంలో ఆదివారం గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు పర్యటించారు. ఇటీవల మృతి చెందిన తన సహాధ్యాయి బావగారైన చిరుమామిళ్ల వెంకట్రామయ్య చిత్రపటానికి యరపతినేని శ్రీనివాసరావు బ్రహ్మానందరెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెంటచింతల సెయింట్ జోసఫ్ హైస్కూల్లో 5 సంవత్సరాల పాటు కలిసి చదువుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కె.శివ ప్రసాద్,వెన్నా శ్రీనివాసరెడ్డి,ఫాదర్ పీటర్ పాపయ్య లున్నారు. 2019 మార్చి తర్వాత గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యే యరపతినేనికి ఆత్మీయ స్వాగతం లభించింది. వందల సంఖ్యలో వచ్చిన వారందరి తోను ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే

కఠిన చర్యలు తప్పవు

వెల్దుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సమందర్‌వలి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. నాటుసారా, మాదక ద్రవ్యాలను విక్రయిస్తే సహించేది లేదన్నారు. ఇటీవల సైబర్ క్రైం ఎక్కువైందని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆక్రమణలు తొలగింపు

సత్తెనపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఆదివారం మునిసిపల్ అధికారులు తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేస్తే సహించేది లేదని మునిసిపల్ అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వెంటనే నిష్పక్షపాతంగా తొలగించాలని మునిసిపల్ అధికారులకు కన్నా ఆదేశాలు జారీ చేశారు.

జెట్టిపాలెంలో చోరీ

రెంటచింతల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలోని ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. గుండా మల్లిఖార్జున తన భార్య లక్ష్మీ సౌజన్య కాన్పు నిమిత్తం ఈనెల 22న గుంటూరుకు వెళ్లారు. శనివారం ఇంటికొచ్చే చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి అందులోనే రూ.62 వేల నగదుతో పాటు బంగారపు చైన్లు, ఉంగరాలు, వెండి చెంబు, వెండి గిన్నెలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటనపై బాధితులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

ముత్యాలమ్మ కొలుపులు

జాతర ప్రారంభం

గురజాలటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంచేసియున్న గ్రామ దేవత ముత్యాలమ్మ కొలుపుల జాతర ఆదివారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు వైభవోపేతంగా జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సోమ, మంగళవారాల్లో గ్రామోత్సవం, బుధవార బియ్యం విడుపు కొలత, గురువారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణతోపాటు శిడిమాను ఉత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటి సభ్యులు ఈ సందర్భంగా కోరారు.

'నాడు - నేడు'

పూర్తయ్యేదెన్నడు?



- ఇసుక కొరతతో గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పాఠశాల నిర్మాణాలు
- ప్రైవేటు భవనాల పరిస్థితి అంతే ..
- కూటమి ప్రభుత్వంలోనూ ఒకింత నిరాశే..
- ఇప్పటికీ ముందుకు కదలని ప్రభుత్వ భవన నిర్మాణ పనులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం పనులు నేటికీ పూర్తి కాలేదు. ఏడాదిగా ఇసుక సరఫరా ఆగిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపో యాయి. వైసీపీ నేతలు ఎంతో ఆర్భాటంగా పథకాన్ని ప్రారంభించినా సకాలంలో పనులను పూర్తిచేయటంలో చేతులెత్తేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.

పిడుగురాళ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' పథకం మొదట, రెండవ విడతలో 270కి పైగా ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతిగదుల నిర్మాణాలు మంజూరయ్యాయి. మొదట్లో నిర్మాణాలకు ఇసుక లభ్యత కోసం సంబంధిత శాఖ అధికారులు టోకెన్లను జారీచేశారు. నాడు-నేడు పనులు నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సభ్యులు టోకెన్లతో రేవుల వద్దకు వెళ్లి ఇసుకను తీసుకొచ్చారు. ఆ తర్వాత టోకెన్ల ఆధారంగా పాఠశాలలకు ఇసుక సరఫరా చేస్తా మని ప్రకటించిన ప్రభుత్వం ఆ పని చేతులె త్తేసింది. దీంతో నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపో యాయి.



నియోజకవర్గంలో వివిధ మండలాల్లో కేవలం ఇసుక కొరతతో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలలు వందకుపైగా వున్నాయి. మరికొ న్నింట్లో మరుగుదొడ్లు, మరికొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు సగంలోనే ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు రావడం నిర్మాణాలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటికీ ఇసుక కొరత తీరిన దాఖలాలు లేవు.

ఇసుక కొరత తీరేనా.. నిర్మాణాలు సాగేనా ?

పల్నాడులో ప్రభుత్వ పాఠశాలలకు, ప్రైవేటు నిర్మాణాలకు సైతం గత ఏడాది నుంచి ఇసుక కొరత ఏర్పడింది. పిడుగురాళ్ల ఎల్ఈ పాఠశాల, జమున పాఠశాలల్లో నిర్మాణాలు నిలిచి రెండేళ్లు అవుతున్నా ఏడాది కాలంగా కాస్త పనులు చేసి మళ్లీ ఇసుక కొరతతో చతికిలపడేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో చిన్నారులు రేకుల షెడ్డులోనూ, ఇరుకైన గదుల్లోనూ కూర్చోవలసి వస్తుంది. అదేవిధంగా పిడుగురాళ్లలో ఆక్స్‌ఫర్డ్, బైపాస్, కళ్లం అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో నిర్మాణాలు ఇసుక కొరత కారణంగా నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వంలోనైనా ఇసుక కొరత తీరుతుందని భావించిన గృహ నిర్మాణదారులు ఒకింత నిరాశ చెందుతున్నారు.

అద్దె రేకుల షెడ్డులో పాఠశాల..

పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలోని జమున పాఠశాల భవనాన్ని రెండున్నరేళ్ల క్రితం నాడు-నేడు పనుల నిమిత్తం తొలగించారు. ఆ తర్వాత ఆర్భాటంగా నిర్మాణం ప్రారంభించినప్పటికీ కొన్నాళ్లకే చేతులెత్తేశారు. దీంతో ఉపాధ్యాయులు పక్కవీధిలోని ప్రైవేటు వ్యక్తుల రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని పాఠశాలను కొనసాగిస్తున్నారు. అరకొర వసతుల మధ్య పాఠశాల కొనసాగడం ఒక తంతు అయితే, ప్రతినెల అద్దె చెల్లించడం పాఠశాల ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. గత్యంతరం లేక దాతల సాయాన్ని తీసుకుంటున్నారు.

ఇసుక కొరత, అధిక వర్షాలతో పనులు నిలిచిపోయాయి..



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకం పనులు ఇసుక కొరత, వర్షాల కారణంగా కొంతకాలంగా నిలిచిపోయాయి. అయితే తక్కువ మొత్తం ఇసుకతో పనులు పూర్తయ్యే అవకాశం ఉన్న పాఠశాలలకు స్థానికంగా ఇసుకను కొనుగోలు చేసి వినియోగించే అవకాశాన్ని ప్రభుత్వం ఇటీవల కల్పించింది. ఎక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన పాఠశాలలకు మాత్రం ప్రభుత్వమే ఇసుకను అందించే ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాదిగా ఇసుక కొరత కారణంగానే పాఠశాలల్లోని భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నది వాస్తవమే. **- సురేష్ నాయక్, నాడు-నేడూ పథకం ఏఈ**

మాచర్ల ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తం

● విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతలు


మాచర్లలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మాచర్లటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని టీడీపీ సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మాజీ కౌన్సిలర్ మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం నెహ్రూనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గిట్టని వారు ఆయనపై దుష్ప్రచారాన్ని చేస్తున్నారని వారు ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గాన్ని అరాచకంగా మారిస్తే, నేడు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రజలు స్వేచ్ఛాయుత జీవనం సాగించే వాతావరణాన్ని కల్పించారన్నారు. సొంత ఆస్తులు అమ్ముకొని ఆయన రాజకీయాలు చేశారన్నారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణజరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సాక్ష్యాత్తు సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో పులి బ్రహ్మానందరెడ్డి దెబ్బకి మేకలు పారిపోయాయని చెప్పారంటే బ్రహ్మానందరెడ్డికి ఉన్న నిబద్ధత ఏమిటో అర్థంమౌతుందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, సూరె యలమంద తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే విషయంపై మండలంలోని విజయపురిసౌత్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి విలేకరులతో మాట్లాడారు.

వెల్దుర్తిలో.. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ పార్టీ, కార్యకర్తలు కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వ్యక్తి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శిరిగిరిపాడులో టీడీపీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత రాజబోయిన మధుసూదనయాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాతులూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో.. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై వచ్చిన ఆరోపణలు సరైనవి కాదని కూటమి నేతలు అన్నారు. మండల కేంద్రమైన దుర్గిలో కూటమి నేతలు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సామాన్యుడు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఉందని, ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. సమావేశంలో కూటమి నేతలు వంకమళ్ల కోటేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మణ్, గోళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆస్తులన్నీ హారతి కర్పూరంలా కరిగిపోయాయని నిస్వార్థంగా ప్రజా సేవచేస్తూ జనం మన్ననలను పొందుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడే సీహెచ్ అబ్బిరెడ్డి అన్నారు. రెంటచింతలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులిద్దరూ మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేస్తే చివరకు బ్రహ్మానందరెడ్డికి మిగిలింది శూన్యమేనన్నారు. ఎమ్మెల్యేగా బ్రహ్మానందరెడ్డి గెలవడం వల్లనే మాచర్ల నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, ఈ విషయాన్ని ఎవరినడిగినా చెప్తారని అన్నారు. తామంతా బ్రహ్మారెడ్డి వెన్నంటే ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.సుమంత్‌రెడ్డి, టీడీపీపట్టణ అధ్యక్షుడు నేతలు ఎం.రాజారెడ్డి, బీ.రామకృష్ణ, ప్రభురాజు, మొండెద్దు శౌరెడ్డి, రాయపరెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

బెల్లంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో నరసరావుపేట పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా బీసీ సెల్ నేత ఓర్సుఆనంద్ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కెల్లా బెల్లంకొండ మండలం సభ్యత్వ నమోదులో ముందంజ లో ఉండాలన్నారు. పార్టీ శ్రేణులందరూ సభ్యత్వ నమో దు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, శ్రీనివాసరావు, లక్ష్మయ్య వెంకయ్య, శ్రీను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం !

- అధ్వానంగా పార్కు పరిసరాలు
- ఆవరణలో విస్తారంగా మొక్కలు
- నిరుపయోగంగా వ్యాయామ పరికరాలు
- పట్టించుకోని పాలకులు

సత్తెనపల్లి,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పుర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించాల్సిన పార్కు పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు నిరుపయోగంగా మారింది. పట్టణంలోని 11వ వార్డు వెంగళరెడ్డి నగర్‌లోని పార్కు అధ్వానంగా తయారైంది. పార్కు ఆవరణలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బహిరంగ వ్యాయామకేంద్రం ఏర్పాటు చేసి ఎంతో విలువైన పరికరాలను సమకూర్చారు. కొంత కాలం నిర్వాహణ బాగానేఉంది. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈపార్కు నిర్వాహణను అధికారులు గాలికి వదిలివేశారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కు అధ్వానంగా మారింది. పార్కు ఆవరణలో పిచ్చి చెట్లు పెరిగి పారిశుధ్య సమస్యల నిలయంగా మారింది. విష సర్పాలు సైతం సంచరిస్తున్నాయి. దీంతో పార్కులోకి రావాలంటే ప్రజలు బయపడుతున్నారు. వ్యాయామ పరికరాలన్నీ నిరుపయోగమై అలంకరణ ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ వార్డులోని ప్రజలు అక్కడ ఒక పార్కు ఉందన్న విషయాన్నే మర్చిపోయారు. పార్కు అసాంఘికశక్తుల అడ్డాగా మారకముందే వెంటనే పార్కు వాతావరణాన్ని, పరిసరాలను మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని, పార్కుని వినియోగకరంగా తీర్చిదిద్దాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దీనిపై సంబంధిత మునిపల్ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.




వెంగళరెడ్డి నగర్‌లో గల పార్కులో దట్టంగా పెరిగిన గడ్డి


నిరుపయోగంగా దర్శనమిస్తున్న వ్యాయామ పరికరాలు

అర్హులందరూ ఎమ్మెల్సీ ఓటుకు

దరఖాస్తు చేసుకోండి

నకరికల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ 2021 సంవత్సరంలో పూర్తిచేసిన వారందరూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటుకు నమోదు చేసుకోవాలని టీడీపీనేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ కోరారు. ఆదివారం నకరికల్లు మండలం కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో స్థానిక నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన వారిని గుర్తించి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకొనేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సోమవారం కుంకలగుంట, చేజర్లలో అర్హులైన ఓటర్లందరినీ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.


ట్రై సైకిల్ అందజేసిన ఎమ్మెల్యే యరపతినేని

ట్రైసైకిల్ అందజేత

పిడుగురాళ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని చెన్నాయపాలెంకు చెందిన విభిన్న ప్రతిభావంతుడైన వంకాయలపాటి రవికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రెంటచింతల,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనకు రాజకీయ ఓనమాలలు నేర్పిన రెంటచింతల సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హామినిచ్చారు. ఆదివారం పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య మంచికల్లు వెళ్లి పూర్వ విద్యార్థి అయిన యరపతినేనికి పాఠశాల స్థితి గతులను గురించి వివరించారు. అలాగే 2025 జనవరిలో పాఠశాల 75 సంవత్సరాల వేడుకలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆ పాఠశాలలో చదవడం వల్లనే తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి పలువురికి సేవ చేస్తున్నానని పేర్కొంటూ 1975 నుంచి 1980 వరకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థినేనని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో టీ. శ్రీనివాసరావు పలువురు ఉన్నారు.


ఆందోళన నిర్వహిస్తున్న ఆదినారాయణ కాలనీ వాసులు

మౌలిక వసతులు కల్పించాలి

● ఆదినారాయణ కాలనీ వాసుల ఆందోళన

కారంపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక ఆదినారాయణ కాలనీ వాసులు ఆదివారం కాలనీలోని ఆదినారాయణ స్థూపం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 200 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ కనీస వసతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులకు ఎన్నో మార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, పాలకులు సైతం దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నేతలు, అధికారులు దృష్టి సారించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు జానీ, మురళి, లక్ష్మయ్య, సీపీఐ నేత బాబు, జనసేన ఎస్సీ సెల్ నేత పీ.బాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రశాంతతకు కృషి

మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణ




ఎం.నారాయణ మాచర్లరూరల్ ఎస్ఐ

మాచర్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు మాచర్ల రూరల్ ఎస్ఐ ఎం నారాయణ తెలిపారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్..

ప్ర: రూరల్ స్టేషన్ పరిధిలో పరిస్థితి ఎలా ఉంది ?

జ : మాచర్ల రూరల్ స్టేషన్ పరిధిలో చిన్నచిన్న వివాదాలపై కేసులు నమోదవుతున్నాయి. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.

ప్ర: పల్లెల్లో ప్రశాంతతకు ఏమేమి చర్యలు తీసుకుంటున్నారు?

జ : సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులతో సమావేశం నిర్వహిస్తున్నాం. ఘర్షణల జోలికి వెళ్తే జరిగే అనార్థాలను వివరిస్తున్నాం. చిన్న చిన్న విషయాలకు గొడవల వెళ్లవద్దని సూచిస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే చర్చల ద్వారా పరిష్కరిస్తామని హామీనిస్తున్నాం.

ప్ర: రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారా?

జ : మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రతి గ్రామానికి ఒక కానిస్టేబుల్‌ను కేటాయించాం. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టారా ?

జ : గ్రామాల్లో పేకాట, గంజాయి, నాటుసారా విక్రయాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాం. మద్యం అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం.

ప్ర: గ్రామస్థులకు ఎటువంటి సూచనలు చేస్తున్నారు?

జ: ఏవిధమైన వివాదాలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని గ్రామస్థులకు సూచిస్తున్నాం. అలాగే పిల్లలను బాగా చదివించుకో వాలని, విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని వారికి ప్రత్యేకంగా చెబుతున్నాం.


శంకు స్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

● హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడులో ఆదివారం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా శంకు స్థాపన జరిగింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యక్రమానికి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా పూజలు

త్రిపురాంతకం, అక్టోబరు 27: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామికి మహన్యాసపూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చలను చేశారు. పూజల అనంతరం ఈవో చెన్నకేశవరెడ్డి, అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు అందజేశారు.


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి దంపతులు

మాచర్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో గల ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నూతనంగా పునర్నిర్మాణం జరిపిన ధ్వజస్తంభం ప్రతిష్ఠలో వారు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటి సభ్యులు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దంపతులకు స్వాగతం పలికి అనంతరం ఘనంగా సత్కరించారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

క్రోసూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ, పల్నాడుజిల్లా అధికారి తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.15 వేలు నుంచి రూ.35 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉండి 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, పోస్టుగ్రాడ్యుయేట్ చదువుతున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు బయోడేటా లేదా రెజ్యూమ్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్లు, పాసుపోర్టు సైజు ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 8074393466, 94922158153 నంబర్లలో సంప్రదించవచ్చని తమ్మాజీరావు పేర్కొన్నారు.


ఎస్ఐ సుధీర్ కుమార్‌కు చిత్రపటాలను అందజేస్తున్న కూటమి నేతలు

సీఎం, డిప్యూటి సీఎం చిత్రపటాల అందజేత

దుర్గి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను కూటమి నేతలు ఆదివారం దుర్గి పోలీసు స్టేషన్ ఎస్ఐ సుధీర్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం చిత్రపటాలను ఉంచాలనడం శుభపరిణామం అన్నారు. అలాగే గతంలో వైసీపీ నేతలు కూటమి నేతలపై పెట్టిన పలు కేసులను పరిశీలించి తగు న్యాయం చేయాలని ఎస్ఐ సుధీర్‌కుమారన్ను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సూరె కృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు రుద్రాల రవి, సూరె సుబ్రహ్మణ్యం, సుధీర్, సాయి పాల్గొన్నారు.



శిల్పారామం ముఖద్వారం


శిల్పారామం పూర్తి చిత్రం


ఫొటో.. సెల్ఫీపాయింట్

శిల్పారామం.. కళానిలయం


బోటింగ్ పాయింట్ కానున్న చెరువు


హస్తకళా స్టాళ్లలోని వస్తువులు


పిల్లల ప్లే జోన్.. ఆట సామాగ్రి


టాయ్ ట్రైయిన్

అద్భుతమైన హస్తకళా శిల్పాలకు నెలవు

ఆధునిక సొబగులతో ఆహ్లాదకర వాతావరణం

హైదరాబాదు స్ఫూర్తిగా గుంటూరులో 2014లో శంకుస్థాపన

అమ్యూజ్‌మెంట్ పార్కు, బోటింగ్, పిల్లల ప్లేజోన్, కన్వెన్షన్ హాలు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కళలకు కొలువు.. హస్త కళా శిల్పాలకు నెలవుగా గుంటూరు శిల్పారామం అలరారుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదుకు కళాతోరణంగా ఉన్న శిల్పారామం స్ఫూర్తితో గుంటూరులో శిల్పారామం రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్ శిల్పా రామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కల్చరల్ సొసైటీ అనేది రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సొసైటీ శిల్పారామం నిర్మాణానికి 2014లోనే నాంది పడింది. అప్పటి మంత్రి రావెల కిశోర్‌బాబు 2016 డిసెంబరు 10న శంకుస్థాపన చేయగా, 2023 అక్టోబరు 14న అప్పటి పర్యా టక మంత్రి ఆర్కే రోజా శిల్పారామాన్ని ప్రారంభించారు. శిల్పారామం గుంటూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అత్యంత పురాతనం, సుసంపన్నం, వైవిధ్యమైన కళలు, గ్రామీణాంధ్ర, సాంస్కృతిక అంశాలను విశ్వవ్యా పితం చేయాలి అనే లక్ష్యంతో శిల్పారామం నిర్మాణం జరిగింది.

మూడు జోన్లలో అభివృద్ధి

గుంటూరు శివార్లలోని అడవితక్కెళ్లపాడులో శిల్పారామాన్ని ఏర్పాటు చేశారు. జోన్-1లో కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలు, ఊలు తివాచీలు, కళంకారీ వస్త్రాలు, పెయింటింగులు విక్రయించే 16 స్టాళ్లు నడుస్తున్నాయి. నాటి నుంచి నేటి యుగం వరకూ ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించేలా ఎంట్రన్స్ ప్లాజాను ఆకర్షణీయంగా నిర్మించారు. ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశారు. పిల్లలను ఆహ్లాదపరిచేందుకు పిల్లల ప్లే జోన్ ఏర్పాటు చేశారు. జానపద, సాంస్కృతిక కళల ప్రదర్శన కోసం కళావేదిక యాంఫీ-థియేటర్‌ను రూపొందించారు.

బోటింగ్ కేంద్రం ఏర్పాటు

శిల్పారామం వెనుకభాగంలో జోన్-2 పరిధిలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును బోటింగ్ కేంద్రంగా మార్చేందుకు సిద్ధమయ్యారు. ఐటీసీ సౌజన్యంతో జీఎంసీ ఏర్పాట్లు ప్రారంభించింది. అవి సగం వరకూ పూర్తయ్యాయి. మిగిలిన నిధుల కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు సమీకరణ జరుగుతుంది. అవి వస్తే ఈ పనులు చకచకా పూర్తై బోటింగ్ కేంద్రం అందుబాటులోకి రానుంది. జోన్- 3 కింద కేటాయించిన 3.31 ఎకరాల విస్తీర్ణంలో పార్కిజోన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పిల్లల కోసం వాటర్ వరల్డ్, చిల్డ్రన్స్ గేమ్స్ అమ్యూజ్ మెంట్ పార్కును నిర్మించనున్నారు.

పల్నాడు మార్గంలో పెరిగిన రైళ్ల వేగం

(7వ పేజీ తరువాయి)

ఆటంకం కలిగే పరిస్థితి ఉత్పన్నమైంది.

పరిస్థితులు మారాయి..

గతంలో గుంటూరు - నంద్యాల రైలుమార్గం సింగిల్ లేన్‌గా ఉండేది. దాంతో రైళ్ల క్రాసింగ్‌ల కోసం చాలా సమయం లూప్‌లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. ఏరోజు సమయానికి ప్రయాణించేవి కావు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోగడ నంద్యాలకు చేరుకోవడానికి కనీసం ఐదు గంటలకు పైగా సమయం పట్టేది. ఇప్పుడు 3 గంటల 40 నిమిషాల వ్యవధిలోనే హాల్టింగ్‌లతో చేరుకుంటున్నాయి. తాజాగా నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్ శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24వ తేదీ ఉదయం 10.54కి గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ రైలు నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో హాల్టింగ్ అయి నంద్యాలకు మధ్యాహ్నం 2.32కే చేరుకుంది. అది మొదలుకొని అక్కడి నుంచి బయలుదేరాల్సిన సమయం సాయంత్రం నాలుగు గంటల వరకు లూప్‌లైన్‌లో ఉన్నది. దాదాపుగా గంటన్నర పాటు నంద్యాల స్టేషన్‌లో ఈ రైలుని నిలపాల్సి వచ్చింది.

కొత్త టైంటేబుల్‌లోనైనా...

ఇదేవిధంగా రాత్రి వేళ హుబ్లీ - నరసపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లు కూడా నిర్ణీత సమయం కంటే ముందుగానే గుంటూరుకు చేరుకుంటున్నాయి. ఆ సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేక పేరేచర్ల, నల్లపాడులో ఆపుకుంటూ తీసుకొస్తున్నారు. అలానే బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు సిగ్నల్ పాయింట్ వద్ద కూడా అరగంట పాటు నిలిపేస్తున్నారు. మొత్తంగా రైళ్ల సగటు వేగం పెరిగింది. అమరావతి ఎక్స్‌ప్రెస్ సమయాన్ని తగ్గించినప్పటికీ మిగిలిన రైళ్ల సమయపట్టికని అలానే కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రైల్వేబోర్డు విడుదల చేయబోయే కొత్త టైంటేబుల్‌లోనైనా గుంటూరు - నంద్యాల మధ్యన రాకపోకలు సాగిస్తున్న రైళ్ల ప్రయాణ సమయాన్ని తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కౌలుకు మంచి రోజులు

- సీసీఆర్ కార్డుల ప్రామాణికంగా రైతులకు రుణాలు
- నిబంధనల విషయంలో సడలింపు ఇచ్చే దిశగా కసరత్తు

(7వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉన్నా బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ క్రమంలో దీనిని సరిదిద్ది కౌలు రైతులకు న్యాయం చేయడంపై పాలకులు దృష్టి సారించారు. వార్షిక పద్దులో 5 శాతం రుణాలు అంటే బాపట్ల జిల్లాలో దాదాపు రూ.200 కోట్లు కౌలు రైతుల వాటాగా ఉండాలి. అలాంటిది ఖరీఫ్ ముగిసే నాటికి అంతా కలిపి ఇచ్చిన రుణాలు రూ.25 కోట్లుగానే ఉండడం గమనార్హం. గుంటూరు జిల్లాలో రూ.95 కోట్లు అందించాల్సి ఉండగా ఇప్పటికీ రూ.9 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారు. ఇక పల్నాడు జిల్లాలో ప్రకటించిన వార్షిక పద్దులో కౌలు రైతుల వాటా దాదాపు రూ.140 కోట్లుగా ఉండగా ఇప్పటికీ అందించింది రూ.16 కోట్లకు మించకపోవడం వారిపై నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతోంది. సీసీఆర్ కార్డు ప్రామాణికంగానే కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడంలేదు. సీసీఆర్ కార్డు గడువు 11 నెలలు మాత్రమే కాగా అది కౌలు రైతుకు చేతికొచ్చేటప్పటికే మూడు, నాలుగు నెలలు గడిచిపోతున్నాయని దానివల్ల వారు రుణాలు తీసుకోలేకపోతున్నారనే అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కౌలు రైతుకు సీసీఆర్‌కార్డు ఇచ్చినా భూమి యజమాని ముందుగానే రుణం తీసేసుకుంటున్నారని దీని వల్ల సాంకేతికంగా ఒకే సర్వే నంబరు మీద రెండుసార్లు రుణం ఇవ్వడం కుదరలేదనేది కూడా బ్యాంకర్ల వాదన. ఒకే సర్వే నంబరుపై ఇద్దరికీ సీసీఆర్ కార్డులను రెవెన్యూ విభాగం మంజూరు చేస్తుందని, ఈ విషయంలో వ్యవసాయశాఖకు, రెవెన్యూ విభాగానికి సమన్వయం కొరవడడంతో అంతిమంగా ఆ ప్రభావం వారు అందుకునే రుణాలపై పడుతుందన్నారు.ఒకే సర్వే నంబరుపై రెండు కార్డులు జారీ చేసినవి ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే దాదాపు 5,000 వరకు ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

సీసీఆర్ కార్డులు పెద్ద సంఖ్యలోనే...

గత ప్రభుత్వంతో పోలిస్తే సీసీఆర్ కార్డుల జారీ విషయంలో కూటమి పాలకులు మెరుగైన ఫలితాలను రాబట్టగలిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాలో 1,06,300 కార్డులను అందించాలని యంత్రాంగానికి వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే 95,000 వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 66,000 కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 90 శాతం చేరుకున్నారు. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో 30 శాతం పెరుగుదల నమోదైంది.

అన్నింటిని పరిష్కరిస్తాం.. రుణాలివ్వాల్సిందే

కౌలు రైతులకు రుణాలు తీసికట్టుగా ఉండడానికి గల కారణాలపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ముందుగా సీసీఆర్ కార్డుల జారీలో దొర్లిన సాంకేతిక తప్పిదాలను సవరించడంతో పాటురుణాల విషయంలో యజమానికి అవగాహన కల్పించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపైనే ప్రభుత్వం పెట్టింది. ఇందుకోసం అవసరమైతే గ్రామాల వారీగా కౌలు రైతులు, యజమానులతో సమావేశాలు పెట్టి వారికి ఉన్న అపోహలు నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా పెట్టింది. రుణాల విషయంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి కనీసం రబీ సీజన్‌లో అయినా కౌలు రైతులకు మంచిరోజులు తేవడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. కౌలు చట్టానికి సవరణలు చేసైనా రైతులకు మేలు చేయాలన్న కృతనిశ్చయంతో కూటమి పాలకులు ఉన్నారు.

బీచ్‌కి రావాలంటే.. రూ.20

రుసుము కడితేనే పర్యాటకులకు ప్రవేశం

జనవరి 1 నుంచి వసూలు చేసేందుకు చర్యలు

అభివృద్ధి కోసం వసూలు చేయాలని బాపట్ల ఎమ్మెల్యే ప్రకటన

బాపట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తీరానికి రావడం.. సముద్ర స్నానాలు చేయడం.. ఆహ్లాదం పొందడం అందరికీ ఇక కుదరదు. ఫీజు కడితేనే సముద్ర తీర ప్రవేశం ఉంటుంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా సూర్యలంక సముద్రతీరం విరాజిల్లుతున్నది. సెలవు వచ్చినా.. పుణ్య స్నానాలన్నా సూర్యలంక బీచ్‌కి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పర్యాటకులు, భక్తులు పోటెత్తుతుంటారు. ఇలా వచ్చే వారి నుంచి ఫీజు వసూలు చేసి ఆ మొత్తంతో తీర ప్రాంత అభివృద్ధి చేయాలని శుక్రవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రకటించారు. రూ.20 ఫీజుగా నిర్ణయించి దానిని జనవరి 1 నుంచి వసూలు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

అయితే ఈ విషయం తెలిసి పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడాలేని విధంగా పర్యాటకుల నుంచి రుసుము వసూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. టోల్‌గేట్ ద్వారా వాహనదారుల నుంచి ఇప్పటి వరకు రుసుము వసూలు చేస్తున్నారు. దీనినే పర్యాటకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాజాగా బీచ్‌లోకి ప్రవేశించే వారి నుంచి కూడా రుసుము వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్న విషయంపై పర్యాటకుల నుంచి విమర్శలు వస్తున్నాయి. తీరంలో మూడుగేట్లు ఏర్పాటు చేసి బీచ్ ఎంట్రీ ఫీజు వసూలు చేయాలని టిక్కెట్లపై బీచ్ డెవలప్‌మెంట్ ఫండ్ అని ఉంటుందని సమాచారం. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ఆదాయ మార్గాలు అన్వేషించాల్సిన విషయాన్ని పక్కన పెట్టి పర్యాకుల నుంచి నగదు వసూలు చేయాలన్న నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని పలువురు చెప్తున్నారు. పర్యాటకులను మరింతగా ప్రోత్సహించేందుకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసేందుకు కసరత్తు చేస్తుండగా ఇక్కడ ఫీజు వసూలు చేయాలన్న నిర్ణయం విమర్శలకు దారితీస్తోంది.


బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో భక్తులు

ఎంపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నీకి సన్నాహాలు

మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా ఏటా నిర్వహణ

రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు


ఎంపీఎల్ జట్టు ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

మంగళగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతియేటా జనవరిలో ఎంపీఎల్ పోటీలు నిర్వహిస్తున్నారు. సీజన్-3లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి బెస్ట్ టీమ్‌లు పాల్గొననున్నారు. మంత్రి లోకేశ్ సొంత నియోజకవర్గమైన మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు పాల్గొననుంది. మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆది వారం నవులూరులోని క్రికెట్ స్టేడియంలో జరిగాయి. ఎంపిక చేయబడిన క్రీడాకారులతో సోమవారం నుంచి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపీఎల్ సీజన్-3 టోర్నీలో మంగళగిరి జట్టు తరపున ప్రాతి నిధ్యం వహించే అవకాశాన్ని కల్పిస్తారు. యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు మంత్రి నారా లోకేశ్ తన సొంత ఖర్చులతో మంగళగిరి కేంద్రంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. దీనికోసం ఇప్పటికే మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో రెండు క్రీడా మైదానాలను కూడా ఏర్పాటు చేశారు.


ఎంపిక పోటీల్లో క్రికెట్ ఆడుతున్న యువకులు

సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో వీవీఐటీకి ద్వితీయస్థానం

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జేఎన్టీయుకే సెంట్రల్ జోన్ మెన్ అండ్ ఉమెన్ బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. విజేతల వివరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ క్రీడలు కమిటీ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం, గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ విజయం సాధించారు. తృతీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల,గుంటూరు కెహెచ్‌ఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథమస్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాలకు, గుంటూరు కెహెచ్‌ఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథమ స్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, తృతీయస్థానం గుంటూరు సెంట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోల్ క్యూబిపి కళాశాలకు సంయుక్తంగా దక్కింది. నెట్‌బాల్ మెన్ విభాగంలో ప్రథమస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు, ద్వితీయస్థానం విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు, మూడో స్థానం సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల నిలిచాయి. విజేతలకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు, జెఎన్టీయుకే ఇంటర్ కాలేజీయట్ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ రాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

అవినీతి అధికారులపై కొరడా

- మెప్మాలో అధికారుల వేధింపులపై ఆర్పీల ఫిర్యాదు
- అవినీతి ఆరోపణలపై మంత్రి నారా లోకేశ్ సీరియస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతి వ్యవస్థ ప్రక్షాళనకు మంత్రి నారా లోకేశ్ నడుం బిగించారు. మంగళగిరిలో ఇద్దరు మెప్మా అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలను మంత్రి లోకేశ్ సీరియస్‌గా పరిగణించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వైసీపీ పాలనలో మహిళా సంఘాలను నిర్వీర్యం చేసి మెప్మాను అవినీతిమయం చేశారు. మంగళగిరిలో ఒక్కో మహిళా గ్రూపు నుంచి రూ.2 వేలు వసూలు చేసి ఇవ్వాలని రిసోర్స్ పర్సన్లపై సీవోలు ఒత్తిడి తెచ్చారు. మెప్మాలో అవినీతి అధికారులపై మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం మంత్రి నారా లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయమై మెప్మా పీడీ విజయలక్ష్మిని వివరణ కోరగా ఆర్పీల నుంచి ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనన్నారు. ఇద్దరు డీపీఎంలతో కమిటీ వేసి సీవోలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించనున్నామన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అవినీతి అధికారుల గుండెల్లో అలజడి మొదలైంది.

నేడు డీఆర్‌సీ మీటింగ్

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి సమావేశం సోమవారం జరగనుంది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ నిర్ణయం తీసుకోగా సమావేశానికి అజెండాని అధికారులు సిద్ధం చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను హాజరు కావాల్సిందిగా సమాచారం ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగనున్న తొలి సమావేశం కావడంతో సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకున్నది. జిల్లాలో ప్రధానంగా ఇసుక కొరత సమస్య పట్టి పీడిస్తున్నది. కొత్తగా మూడు రీచ్‌లకు టెండర్లు నిర్వహించినా కృష్ణానదిలో వరద ప్రవాహం కారణంగా ఇసుక తీయలేని పరిస్థితి నెలకొన్నది. కొత్త రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్ల కోసం అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తికి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ నేపథ్యంలో పత్తి కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు సడలించి అయినా సరే కనీస మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేసేలా చూడాలని పత్తి రైతులు వేడుకుంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్ని దెబ్బతిన్నాయి. గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నా ఆ శాఖ పట్టించుకోవడం లేదు. ఉండవల్లి గుహలు, ఉప్పలపాడు పక్షి కేంద్రం, పొన్నూరు దేవాలయాలు, తెనాలిలో సాగునీటి కాలువలు, నగర శివారులో శిల్పారామం వంటి వాటిని అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

డయేరియా ప్రబలకుండా చర్యలు

వినుకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డయేరియా వ్యాధులు ప్రబలకుండా స్థానిక హెడ్‌వాటర్ పంప్‌ను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదివారం పరిశీలించారు. పరిశుభ్రమైన నీరు సరఫరా అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాచేపల్లిలో అతిసార వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జీవీ ఆదేశాల మేరకు డయేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్న చెప్పారు.

అండర్-14 అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ హైస్కూల్ సిరిపురంలో ఈ నెల 28న జరగాల్సిన అండర్-14 అథ్లెటిక్స్ బాలుర, బాలికల ఎంపికలు 29కి వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎస్ సురేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. 29న నరసరావుపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్లో అండర్-14, అండర్-17 టెన్నికాయిట్, రోప్ స్కిప్పింగ్ పోటీలు, 30న నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్లో అండర్-14, 17 రగ్బీ, చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్లో నెట్‌బాల్, నవంబరు 1న నూతక్కి జడ్పీ హైస్కూల్లో అండర్-14 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలు, 2న నంబూరు ఎంఎస్‌కే ప్రసాద్ గ్రౌండ్స్‌లో అండర్-17 బాలుర, బాలికల క్రికెట్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు.

10న మహా రుద్రాభిషేకం

వినుకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) నవంబరు 10వ తేదీన స్థానిక జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య పెద్దలతో కలిసి రుద్రాభిషేకం పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలేజీ గ్రౌండ్‌లో మట్టి శివలింగానికి మహా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. కావున భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగునీరు వృథా

• రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో వాహనదారులకు ఇక్కట్లు


యలమందల సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న సాగునీరు

నరసరావుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సాగునీరు వృథా అవుతోంది. కోటప్పకొండ రహదారి యల మందల సమీపంలో మైనర్ కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి. దీంతో, ఆ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పెద్ద ఎత్తున సాగు నీరు వృథా అవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. జలవనరుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, సాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని, సాగునీటి వృథాను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

260 మందికి వైద్య పరీక్షలు


బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

యడ్లపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ, లింగారావు పాలెం విజన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. యడ్లపాడులోని పీఆర్ విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు గుంటుపల్లి భవ్యతేజ, శొంఠినేని నవ్యశ్రీలు పాల్గొని వైద్యసేవలు అందించారు. శిబిరానికి హాజరైన 260మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడ మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు చెన్ను పాటి పూర్ణచంద్రరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు కేతా రాంబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, ముత్తవరపు వేణుగోపాల్, బచ్చు రాజేష్, ముత్తవరపు ధర్మతేజ, ఫౌండేషన్ సభ్యులు సామినేని శ్రీనివాసరావు, రావూరి సుమన్ తదితరులు పర్యవేక్షించారు.

ఓటర్ నమోదుకు విశేష స్పందన


ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎన్డీఏ కూటమి నాయకులు

వినుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమానికి ఆదివారం విశేష స్పందన లభించింది. స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నవంబరు 6వతేదీ నాటికి ఓటరు నమోదు కార్యక్రమం ముగియనున్నట్లు వారు తెలిపారు. కావున శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్డీఏ కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గట్టమనేని రామకృష్ణ, పెమ్మసాని నాగేశ్వరరావు, ఆయూబ్ ఖాన్, సౌదాగర్ జానీ బాష, మేడమ్ రమేష్, వీరయ్య, జనసేనా నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కూలి ఆరేళ్లు .. ప్రత్యామ్నాయ రహదారిలోనూ సమస్యలు

• ఆరు సంవత్సరాలైనా నిర్మాణం ఊసేలేదు
• విప్పర్లపల్లి సమీపంలో బ్రిడ్జి నిర్మించాలి
• వర్షం వస్తే కోతకు గురయ్యే రహదారి


విప్పర్లపల్లి వద్ద కూలిన బ్రిడ్జి, పక్కనే కోతకు గురైన రహదారి

రొంపిచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల పల్లి సమీపంలో బ్రిడ్జి కూలి ఆరేళ్లయింది. ఇంత వరకూ దీని నిర్మాణం పూర్తి కాలేదు. దీనిపై రాకపోకలు సాగక పోవటంతో ప్రత్యామ్నాయంగా పక్కనే రహదారిని ఏర్పాటు చేశారు. అయితే, వర్షాలు కురిస్తే ఈ రహదారి కూడా కోతకు గురై, వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలవాల, అచ్చయ్య పాలెం, తురుమెళ్ళ, సుబ్బయ్యపాలెం, బొగ్గరం, వీరవట్నం, అన్నవరప్పాడు, ముత్తనపల్లిల ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పలుమార్లు టెండర్లు పిలిచినా ఈ రహదారి నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదు. కొన్నిరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఈ రహదారిని పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కోతకు గురై గూనలు కొట్టుకుపోయాయి. అనంతరం గూనలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేశారు. శాశ్వత రహదారి నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలే కుటుంబంగా తెలుగుదేశం పార్టీ

• టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న జీవీ, మక్కెన


ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నుంచి శాశ్వత సభ్యత్వం పత్రాలు అందుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార తెలుగుదేశం, విపక్ష వైసీపీకు మధ్య తేడా క్యాడర్, క్యారెక్టర్ అని, కార్యకర్తలే కుటుంబంగా తెలు గుదేశం ఉంటే, క్రిమినల్స్ కార్యకర్తలుగా ఉన్న పార్టీ వైసీపీ అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎద్దేవ చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివా రం ఏర్పాటు చేసిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని, చరవాణి ద్వారా జీవీ తన పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరణ చేసుకున్నారు. లక్ష రూపాయలు చెల్లించి పార్టీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం వాసవీ కల్యాణ మండపంలో జరిగిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చరవాణి ద్వారా లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వా న్ని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తల పరువునే కాకుండా సొంత తల్లి, చెల్లిని కూడా కోర్టుకు ఈడ్చిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని విమర్శించారు. పార్టీ సభ్యత్వ తీసుకున్న కార్యకర్తలకు గతలో రెండు లక్షల ప్రమాద బీమాను, ఈ ఏడాది ఐదు లక్షలకు పెంచినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం : కుర్రా రత్తయ్య


టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మర్రిపాలెం(యడ్లపాడు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల రక్షణతోపాటు వారి సంక్షేమం తెలుగుదేశం పార్టీ ధ్యేయమని డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుర్రా రత్తయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఉన్నవ పంచాయతీ శివారు గ్రామమైన మర్రిపాలెంలో కుర్రా రత్తయ్య ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పార్టీ విజయం కోసం కార్యకర్తలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా కృషి చేశారన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌లు పలు పథకాలు తీసుకొస్తున్నారన్నారు. దానిలో భాగంగానే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. రూ.100లతో పార్టీ సభ్యత్వ తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా, ఇతర సేవలు లభిస్తాయన్నారు. ప్రతి కార్యకర్త, అభిమాని దీనిని సద్వినియోగించుకోవాలని, సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నవ గ్రామ అధ్యక్షుడు కాకుమాను శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు మాదల శివరామకృష్ణ, నాయకులు ఇడుపలపాటి సాయిబాబు, కొత్తపల్లి మరియదాసు, చినబాబు, వెల్లటూరు శేషయ్య, కె. సాంబశివరావు, పి.నిరీక్షణ, కె.శ్యామ్యూల్, జి.పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరికోస్ వెయిన్ ఉచిత వైద్య శిబిరం


కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కోడెల శివరామకృష్ణ, డాక్టర్ సంపత్, డాక్టర్ సువర్ణకుమారి తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాగారికోటలోని డాక్టర్ కోడెల శివప్రసాద రావు ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన వేరికోస్ వెయిన్ ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివ రామకృష్ణ ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన గో హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సువర్ణకుమారి నరవ, డాక్టర్ సంపత్ వాదిత్యలు వైద్యసేవలు అందజేశారు. 402 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 212 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. ప్రతి రోగికి కలర్ డాప్లర్ స్కానింగ్ నిర్వహించి వేరికోస్ వెయిన్ ఉన్న ప్రతిరోగికి తక్కువ ఖర్చుతో అడ్వాన్స్ సాంకేతిక పరిజ్ఞానంతో ఏఐ కృత్రిమ మేధతో కూడిన మైక్రో వేబిలేషన్‌తో ఖచ్చితమైన చికిత్స అందజేస్తామని డాక్టర్ సంపత్ తెలిపారు. పల్నాడు ప్రాంతంలో వేరికోస్ వెయిన్ వ్యాధి ఎక్కువగా ఉందని, అందుకే ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించేందుకు ముందుకు వచ్చామన్నారు. కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ నరసరావుపేట, సత్తెనపల్లి ప్రాంతంలో వేరికోస్ వెయిన్ బారిన పడిన వారు ఎక్కడికి వెళ్లాలో తెలియక బాధపడుతున్నారని, వారికి సాయం చేయాలనే ఉద్దేశ్యంతో గో హాస్పిటల్ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు.

గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి


పెరుమాళ్లపల్లి మేజర్ కాలువ

ఈపూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఆయా మండలాల పరిధిలో ఉన్న సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారు. అందుకోసం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో నీటి సంఘాల అధ్యక్ష పదవి కోసం ఆశావహులు పెరిగిపోతున్నారు. 2003లో సాగునీటి వినియోగదారుల సంఘాలు ఆవిర్భవించగా, 2005లో ఎన్నికలు జరిగాయి. 2020 వరకు ఆ సంఘాలే బాధ్యతలు నిర్వర్తించాయి. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సంఘాలను, కాలువల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు అనడంతో ఆశావహులు ఉత్సాహంగా ఉన్నారు. అయితే పార్టీ కోసం పని చేసిన రైతు నాయకులు ఉత్సాహంగా ఉన్నప్పటికీ వారిలో ఎక్కడో కొంత నిరుత్సాహం ఉంది. ఈపూరు మండలంలో మేజర్‌లు, మైనరులు, చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి. సాగునీటి కాలువలు గత ఐదేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోకపోవడంతో చివర భూముల రైతులు అవస్థలు పడుతున్నారు. సమస్యలను అధికారులకు చెప్పుకోవాలన్నా వారు అందు బాటులో ఉండడం లేదు. సాగునీటి సంఘాలకు అధ్య క్షుల ఎన్నిక జరిగితే అన్నదాతల బాధలు వారికి చెప్పుకోవడానికి అందుబాటులో ఉంటారని రైతులు భావిస్తున్నారు.

పౌష్టికాహారం పక్కదారి

• చేతివాటం ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు
• పలుమార్లు తనిఖీ నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు
• ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించాలని సూచనలు


మండలంలోని ఓగ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం

రొంపిచర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, మునమాక, విప్పర్ల, సెక్టార్ల పరిధిలో 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు, బాలింతలకు వివిధ రకాల పౌష్టికాహారం కందిపప్పు, పామోలిన్, కోడి గుడ్లు, బాలామృతం, అటుకులు, చిక్కీలు, ఖర్జూర పండ్లు అందజేస్తారు. అయితే, ఆయా కేంద్రాల్లో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పలుమార్లు తనిఖీలు నిర్వహించిన సమయంలో చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు గ్రహించారు. సంబంధిత సూపర్‌వైజర్లు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల క్రితం సంతగుడిపాడు ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లో కాలం చెల్లిన ఆవు పాలు ప్యాకెట్లను గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ పడవేసి వెళ్లారు. అప్పట్లో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. అంతేగాక, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య కూడా నామమాత్రంగానే ఉంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పలుచోట్ల అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ ఎవరో ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. పలు సెక్టార్లకు నరసరావుపేట నుంచి నిత్యం కేంద్రాలకు వెళ్లి వస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలపై మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల పసికందులను విక్రయించిన కేసులో నిందితులైన పట్టణంలోని కుమ్మర బజారుకు చెందిన కుంచపు రమణ, క్రిస్టియన్‌పాలెంకు చెందిన జంగాల మరియమ్మ, నిమ్మతోటకు చెందిన పంగులూరి నాగలక్ష్మి, క్రిష్టియన్‌పాలెంకు చెందిన జాపం పద్మలు రెండో పట్టణ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. నిందితులను అదుపులోకి తీసుకొని కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అమ్మకానికి గురైన పసికందులను బాలల సంరక్షణ అధికారి ఆధ్వర్యంలో సంరక్షణ కార్యాలయానికి తరలించినట్టు సమాచారం.

అస్యభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

వినుకొండటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని చితక్కొట్టి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన పట్టణంలోని ముట్లకుంట కాలనీ శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన వీరయ్య మద్యం మత్తులో తరచూ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో, మహిళల కుటుంబసభ్యులు వీరయ్యకు దేహశుద్ధి చేసి, బాధిత మహిళలు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత


నరసరావుపేట లీగల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మొదటి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌కు చెందిన ఓ బాలిక ఈనెల 26వ తేదీ నుంచి కన్పించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ చరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ వంశీకృష్ణ నేతృత్వంలో పోలీసు బృందం 24 గంటల్లో సదరు బాలికలను వెతికి ఆచూకీ కనుగొని ఆమె తల్లి దండ్రులకు అప్పగించారు.

దేవాలయంలో చోరీకి యత్నం

• నిందితుడి బైకు స్వాధీనం

శావల్యాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేవాలయంలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని గ్రామస్థులు గుర్తించడంతో తన ద్విచక్రవాహనాన్ని వదిలి పరారైన ఘటన శావల్యాపురంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగానున్న అద్దంకమ్మ, పోలేరమ్మ దేవాలయాల్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు గుర్తించి దేవాలయం నిర్వాహకుడికి ఫోన్ చేశారు. ఆయన వెంటనే ఆలయం వద్దకు వచ్చి చోరీ చేస్తున్న వ్యక్తిని కర్రతో కొట్టాడు. కానీ అతడు తన ద్విచక్ర వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు విషయాన్ని తెలియజేసి ద్విచక్రవాహనాన్ని వారికి అప్పగించారు. ద్విచక్రవాహనం నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేయగా బైకు సత్తెనపల్లికి చెందిన సంతోష్‌దిగా పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాన్ని పోలీసులు భద్రపరచకుండా నిర్లక్ష్యంగా స్టేషన్ బయట పెట్టడంతో దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. విషయం తెలిసిన గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ లోకేశ్వరరావును ద్విచక్ర వాహనం ఏదని ప్రశ్నించగా ఆయన స్టేషన్ బయట సీసీ కెమెరా పనిచేయడం లేదని, బైకు ఎవరు తీసుకెళ్లారో తెలియదని చెప్పడంతో గ్రామస్థులు విస్తుపోయారు. పోలీస్‌స్టేషన్ వద్ద పెట్టిన బైకులకే రక్షణ లేకపోతే ఇళ్ల వద్ద పెట్టిన వాహనాల పరిస్థితి ఏంటని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఆలయంలో చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని వెంటనే గుర్తించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో అద్దంకి వాసి మృతి


నాగేశ్వరరావు(ఫైల్)

చిలకలూరిపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పట్టణానికి సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన గోనుగుంట నాగేశ్వరరావు (52) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. విజయవాడ నుంచి ద్విచక్ర వాహనంపై అద్దంకికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు తగిలాయి. కొద్దిసేపటికి అతడు మృతి చెందాడు. చిలకలూరిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అద్దంకిలో అతడు మేస్త్రీగా పని చేస్తున్నట్లుగా సమాచారం.

ఎలుకల నివారణకు చర్యలు : ఏవో రామారావు



ఈపూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో సామూహికంగా ఎలుకల నివారణకు చర్యలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. ఎలుకల నివారణకు అవసరమైన మందు అందజేయడమేగాక నూకలు, శనగనూనె కలిపి పొలంలో పెట్టడంపై రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. సామూహికంగా ఎలుకల నివారణ, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై వ్యవసాయాధికారి రామారావుతో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్.

ఎలుకల నివారణకు మందు పంపిణీ చేశారా?

ఏవో: మండలంలో సామూహిక ఎలుకల నివారణ కోసం 39 కిలోల మందును రైతులకు పంపిణీ చేశాం. అంతేకాకుండా రైతులు తెచ్చుకున్న నూకలు, శనగనూనె కలిపి ఎలా పెట్టాలో మిశ్రమం తయారు చేసి అవగాహన కల్పించాం.

ఈ క్రాప్ బుకింగ్ పూర్తయిందా?



ఏవో: మండలపరిధిలో ఇప్పటి వరకు 5 వేల హెక్టార్లలో ఈక్రాప్ బుకింగ్ పూర్తయింది. రబీకి సంబంధించి మరో 6వేల ఎకరాల్లో ఈక్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంది.

నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏవో: ఎరువులు, పురుగు మందుల షాపులకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలి. అనుమతులు లేకపోయినా, నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. పురుగు మందులు కొనేటప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి.

బయో పురుగు మందులు వాడొచ్చా?

ఏవో: పంటలపై బయో పురుగుమందులు వాడటం వల్ల దిగుబడులు తగ్గుతాయి. కానీ కొందరు అనుమతులు తెచ్చుకొని విక్రయిస్తున్నారు.

పంటలకు బీమా ఉందా?

ఏవో: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా సౌకర్యం ఉంది. ఖరీఫ్‌లో ఉచితంగా బీమా చేసినప్పటికీ రబీలో రూ.643 ప్రీమియం చెల్లించాలి.

సంక్రాంతి పండుగ నాటికి గ్రామాల్లో కొత్త కళ

• ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు


అప్పాపురంలో శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే సంక్రాంతి నాటికి అభివృద్ధి పనులతో గ్రామాల్లో కొత్త కళ నెలకొంటుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులతో కలసి ఆదివారం శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, గోకులాలు తదితర 30వేల పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నిధుల పరంగా ఎలాంటి సమస్యలు లేవని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, సర్పంచ్ నెల్లూరి ఆదినారాయణమ్మ, ఏఈ కే వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్ కరీముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, నెల్లూరి హరిబాబు, శంకరరావు, జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్ పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేయాలి • ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ తదితరులు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం డాక్టర్లు పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని ఐఎంఏ హాల్లో గుండె, ఊపిరి తిత్తుల్లో రక్తపు గడ్డల నివారణపై డాక్టర్ కృష్ణ కాంత్, హిమజ, మహేశ్వరరావుల ఆధ్వర్యంలో ఆదివారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమకాలీన పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై వక్తలు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతి, నిజాయితీ మానవత్వం ఉన్న వారు వైద్యులు అన్నారు. రోగులకు సత్వర న్యాయం చేయాలన్నారు. 30శాతం ఉచితంగా వైద్యసేవలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కొండపల్లి వెంకటేశ్వర్లు, గజ్జల బ్రహ్మారెడ్డి, ఎస్ రాంప్రసాదు, హిందూజ తదితరులు పాల్గొన్నారు.


గిరిజనుల హక్కులను కాపాడేలా పాలన

• ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


గిరిజన సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి, బంజార ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారి హక్కులు కాపాడేలా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎస్టీ సామాజికవర్గానికి చెందిన ప్రతినిధులు, నాయకులతో ఆదివారం ఎమ్మెల్యే జీవీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై చర్చించారు. వినుకొండలో సేవాలాల్ మహారాజ్ గుడితో పాటు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని సేవాలాల్ సంఘం నాయకులు ఆంజనేయులును కోరారు. ఆయన హామీ ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, రాంబాబునాయక్, గోవిందనాయక్, హనుమాన్ నాయక్, సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్ర వైద్యశాల ద్వితీయ వార్షికోత్సవం


డాక్టర్ కంఠంనేని రవీంద్ర

నరసరావుపేట లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పల్నాడు బస్టాండ్‌లో గల రవీంద్ర గ్యాస్ట్రో లివర్ కేర్ వైద్యశాల ద్వితీయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఆదరించి, అభిమానిస్తున్న పల్నాడు ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ వైద్యశాలలో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అధునాతన పరికరాలతో లివర్‌కు సంబంధించిన అన్ని ప్రాణాంతక జబ్బులకు చికిత్సను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, లింగ య్యా చౌదరి, డాక్టర్ పాతూరి అశోక్, పట్టణానికి చెందిన ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు రూ.లక్ష విలువైన సాయం అందజేత

చిలకలూరిపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పేదలకు ఒక రూ.లక్ష విలువైన సాయాన్ని అందచేశారు. క్లబ్ సీనియర్ సభ్యులు దివంగత కోటిరెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు, రైతులకు పవర్ స్ప్రేయర్లు, మహిళలకు కుట్టుమిషన్లు, పేద విద్యార్థులకు ఫీజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పారిశ్రామికవేత్త పేర్ని వీరనారాయణ, రోటరీ మాజీ గవర్నర్‌లు జాష్టి రంగారావు, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, కోటిరెడ్డి కుటుంబసభ్యులు రమాదేవి, యశ్వంత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.